సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం ၊ 14 ၊ ఫిబ్రవరి ၊ 2025



న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



వంటశాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

ఇల్లెందు: విద్యాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి సూచించారు. గురువారం ఆమె ఇల్లెందులోని సుదిమళ్ల గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, ఆశ్రమ పాఠశాల, హాస్టళ్లను సందర్శించారు. మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. వంటశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. అక్కడి నుంచి సబ్ జైలును సందర్శించి ఖైదీలకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు న్యాయసహాయం అందిస్తామన్నారు. అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, న్యాయవాది నిరంజన్‌రావు, ఉమామహేశ్వర రావు, కీర్తి కార్తీక్, పి.బాలకృష్ణ, టి.ప్రభాకర్, జయప్రకాష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంటౌన్: వచ్చే నెల 8న కొత్తగూడెం జిల్లా కోర్టులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసులనుంచి బయట పడాలని తెలిపారు. క్రిమినల్ కేసులు, యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలు, వివాహ సంబంధ కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, ట్రాఫిక్ చలాన్‌లు, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ తగాదాలు, బ్యాంకు లావాదేవిలు, టెలిఫోన్ బకాయిలు తదితర కేసులు రాజీతో పరిష్కరించుకోవాలని కోరారు.

మరోసారి ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శిగా మాధవ నాయక్



మాధవ నాయక్‌ను అభినందిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శిగా పి.మాధవనాయక్ మరోసారి ఎన్నికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఏబీకేఎంఎస్ త్రైవార్షిక మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. గురువారం మాధవనాయక్ వివరాలు వెల్లడించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి నిత్యం యాజమాన్యంతో పోరాటాలు నిర్వహిస్తున్నట్లు, ఇక ముందు కూడా అదే తరహాలో ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పవన్‌కుమార్, వినయ్ కుమార్, జీవి కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్, నాగప్రసాద్, నాయిని సైదులు, నాగేశ్వరరావు, బి.కిషన్ తదితరులు అభినందించారు.

- పెళ్లి విషయంలో యువత పరిణితి
- తల్లిదండ్రుల నిర్ణయమే ఫైనల్ అని వెల్లడి
- ప్రేమించినా అమ్మానాన్నను ఒప్పిస్తామని ధీమా

పెద్దల మాటకే జై!


ప్రేమ, ఆకర్షణో తెలియని వయస్సులో దగ్గరవడం.. ఆపై పెద్దల దృష్టికి తీసుకెళ్లి వారు అంగీకరిస్తే సరి.. లేకపోతే స్నేహితుల సాయంతో పెళ్లి చేసుకోవడం.. ఆతర్వాత ఒడిదొడుకులు ఎదుర్కొనే జంటలు కనిపిస్తున్నాయి. అయితే, ప్రస్తుత తరంలో భవిష్యత్‌పై స్పష్టమైన లక్ష్యాలు ఉండడం.. చదువు తర్వాత ఉద్యోగ సాధన.. ఆపై ఆర్థిక స్థిరత్వం తప్పనిసరిగా ఉండాలనే ధోరణి నానాటికీ పెరుగుతోంది. ఈక్రమంలోనే పెళ్లి విషయంలో పెద్దల మాటకే విలువ ఇస్తామని ఎక్కువ మంది చెబుతున్నారు. ఇందులో యువతులే కాక యువకులూ ఉండడం విశేషం. ఒకవేళ మనస్సులు కలిసి జీవితాంతం కలిసి ఉంటామనే నమ్మకం ఏర్పడి పెళ్లి చేసుకోవాలనుకున్నా పెద్దల అంగీకారం తప్పక తీసుకుంటామని అంటున్నారు. అయితే, ప్రేమ పెళ్లి విషయంలో యువతులతో పోలిస్తే యువకుల్లో కొంత ఎక్కువగా ఆసక్తి కనిపించింది. నేడు (శుక్రవారం) ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 'సాక్షి' ఆధ్వర్యాన చేపట్టిన సర్వేలో ఇదే వెల్లడైంది. – సాక్షి నెట్‌వర్క్


సర్వే సాగిందిలా...

01) ప్రేమ పెళ్లి సరైనదేనా?
02) పెద్దలు కుదిర్చిన పెళ్లే మంచిదా?



అన్న ప్రశ్నలతో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 'సాక్షి' బృందం గురువారం సర్వే నిర్వహించింది. నియోజకవర్గానికి 30మంది చొప్పున 300మందితో సర్వే సాగింది. ఇందులో 150మంది యువతులు, మరో 150 మంది యువకులు ఉన్నారు. బీఈడీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలతో పాటు లైబ్రరీల్లో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న 25 నుంచి 30ఏళ్ల లోపు వారికి 'సాక్షి' బృందం ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టింది.





కొందరు యువతీ, యువకులు వెల్లడించిన అభిప్రాయాలు

- ✓ చదువుకునే సమయాన ఏర్పడే ఆకర్షణను ప్రేమగా భావించవద్దు. పెద్దల అనుమతి లేకుండా పెళ్లి చేసుకుంటే జీవితంలో సమస్యలను ఎదుర్కోవడంతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయి.
- ✓ ప్రేమ పెళ్లి మంచిదే. కానీ జీవితంలో ఎదగాలంటే ప్రేమ పెళ్లయినా పెద్దల అనుమతితో జరగాలి. తద్వారా వైవాహిక జీవితం అద్భుతంగా ఉంటుంది.
- ✓ ప్రేమ వివాహంలో ఒకరినొకరు అర్థం చేసుకుంటూ సంతోషంగా గడపవచ్చు.
- ✓ పెద్దల మనసు గెలుచుకుని ప్రేమ వివాహాలు చేసుకున్న వారే జీవితంలో నిలబడగలిగారు. పెద్దల అండ లేకుంటే ప్రేమ పెళ్లి మంచిది కాదు.
- ✓ ప్రేమ పెళ్లిలోనే ఇద్దరి నడుమ అవగాహన ఎక్కువగా ఉంటుంది.
- ✓ పెద్దలు కుదిర్చిన పెళ్లిలో దంపతుల నడుమ అభిప్రాయ భేదాలు వచ్చినా సర్దిచెప్పడానికి, సరిచేయడానికి తల్లిదండ్రులు అండగా నిలుస్తారు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంటే సరైన తోడ్పాటు లేక ఇబ్బంది ఎదురవుతుంది.
- ✓ పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్న ఎన్నో జంటలు సంతోషంగా ఉంటున్నాయి.
- ✓ ప్రేమించుకున్నా.. పెద్దల అనుమతితో వివాహం చేసుకున్న జంటలే సుఖంగా జీవిస్తున్నాయి. పెద్దల మాట వినడం మంచిది.
- ✓ పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా అర్థం చేసుకునే పార్టనర్ దొరకకపోతే ఇబ్బందులు పడాలి. అర్థం చేసుకునే పార్టనర్ దొరికితే అది ఏ వివాహమైనా పెద్ద ఇబ్బందులేవీ ఉండవు.
- ✓ పెద్దల అనుభవం, వారి ముందుచూపుతో కుదిర్చిన వివాహాలే కలకాలం నిలుస్తాయి.

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం కలిగించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చర్ల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని కలిగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. చర్లలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, డయాలసిస్ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. మందుల గది, రక్త పరీక్షా కేంద్రం, వివిధ వార్డులు, స్టోర్‌రూం తదితర వసతులను పరిశీలించారు. వార్డులో బాధితులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్రీ ఫేస్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీఎస్ ఎంఐడీసీ డీఈని ఆదేశించారు. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల్లో సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా బాధితులు ఉన్నారని, రక్తమార్పిడి కోసం భద్రాచలం వెళ్లడం కష్టంగా ఉందని, చర్లలోనే బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా.. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం చింతకుంట, మొగళ్లపల్లి ఇసుక క్వారీలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు, స్టాకు పాయింట్లను పరిశీలించారు. లోడింగ్, వే బిల్లుల తనిఖీ విధానంపై సొసైటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు రవిబాబు, సాయివర్ధన్, కాంత్, జగన్, మేనేజర్ భాస్కర్ తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



చుంచుపల్లి : మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

ఔషధ మొక్కలు నాటాలి

దుమ్ముగూడెం: పర్ణశాల ఆలయం ప్రాంగణంలో ఔషధ మొక్కలను విరివిగా నాటాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక పంచాయతీ సహకారంతో తులసి తదితర మొక్కలు నాటాలన్నారు. భక్తుల రాకపోకలకు ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నారు. ఆ తర్వాత ఆలయం ముందు ఉన్న విప్ప పువ్వుల విక్రయదారులతో మాట్లాడారు. కొంత విప్ప పువ్వు కొనుగోలు చేశారు. కలెక్టర్ వెంట అధికారులు ఎల్.రమాదేవి, రవీందర్, శ్రీనివాస్, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

చుంచుపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. గురువారం ఆనంద ఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్ -1 రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ట్రైనింగ్ నోడల్ అధికారి నగిన సతీష్ కుమార్, డీఎల్‌పీఓలు సుధీర్ కుమార్, రమణ, విద్యాశాఖ కో-ఆర్డినేటర్లు ఎస్.కె. సైదులు, నాగ రాజశేఖర్, మాస్టర్ ట్రైనీలు సాయి కృష్ణ, శ్రీనివాస రావు, చలపతి రాజు, దుర్గా శైలజ, స్వరూప్ కుమార్, బి.వి.ఎల్.కుమార్, ఆనంద్ కుమార్ స్వామి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చర్ల: చికిత్స పొందుతున్న బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

గిరిజన గ్రామాల్లో పనులు పూర్తి చేయించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపడుతున్న పనులు త్వరగా పూర్తయ్యేలా వేగం పెంచాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులతో సమావేశమైన ఆయన పనుల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు, అదనపు తరగతి గదులు, ప్రహరీల నిర్మాణంలో వేగం పెంచాలని చెప్పారు. వైరాలో గిరిజన భవనం, పాఠశాల డార్మిటరీ పనులు ఈనెల 20వ తేదీ నాటికి పూర్తయ్యేలా పర్యవేక్షించాలి సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను పక్కన పెట్టి, నిబంధనల ప్రకారం ఇతరులకు అప్పజెప్పి పూర్తిచేయించాలని తెలిపారు. గుండాల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం, గ్రామాల్లో రహదారులు, జీపీ భవనాల నిర్మాణం మార్చి 31నాటికి పూర్తి కావాలని పీఓ స్పష్టం చేశారు. అలాగే, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, డీఈ రాజు, ఏఈలు శ్రీకాంత్, హిమజ, విజయ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు

పాల్వంచ: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సీపీఐ సిద్ధంగా ఉందని.. పొత్తులు, సర్దుబాట్లపై ఎన్నికల సమయాన నిర్ణయం తీసుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. పాల్వంచలో గురువారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ పంచాయతీలో సీపీఐకి ప్రాతినిధ్యం ఉండేలా కార్యకర్తలు, నాయకులు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక సీపీఐ శత వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించాలని తెలిపారు. కాగా, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై గౌరవం లేని పాలకుల చేతిలో దేశం మగ్గుతోందని, అందులో భాగంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో నేతలపై అక్రమ కేసులు పెట్టడం, సీబీఐ, ఈడీ ద్వారా దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈసమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా, నాయకులు బి.అయోధ్య, ముత్యాల విశ్వనాథం, పుల్లారెడ్డి, సలీం, సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, శ్రీనివాస్, ఎల్లయ్య, శంకర్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, మురళీ, దస్రు, నాగయ్య, రాంచందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపడింతుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్ శర్మ పాల్గొన్నారు

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పెద్దమ్మతల్లి అమ్మవారిని, శివాలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, ఆలయ మాజీ డైరెక్టర్ చందుపట్ల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



అమ్మవారి సన్నిధిలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు

వడదెబ్బ నివారణ జాగ్రత్తలు పాటించాలి

కొత్తగూడెంఅర్బన్: రాబోయే వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ్బబారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, అధికారులు సుకృత, బాలాజీ, చైతన్య, మధువరన్, స్పందన, ఫైజ్ మొహీద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఎండలో నిలబెట్టిన యాజమాన్యం

పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని చర్యలు

బూర్గంపాడు: పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని ముగ్గురు విద్యార్థులను మండుటెండలో నిలబెట్టిన ఘటన బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర లోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం జరిగింది. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. మోరంపల్లిబంజరలోని స్టెల్లా మేరీస్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదినిమిషాలు ఆలస్యంగా పాఠశాలకు వచ్చారు. వారిని యాజమాన్యం పాఠశాల మెయిన్‌గేట్ వద్ద మండుటెండలో గంటన్నరసేపు నిలబెట్టింది. విషయం తెలిసి తాము వెళ్లి ప్రశ్నిస్తే యాజమాన్యం దురుసుగా ప్రవర్తించిందని తల్లిదండ్రులు తెలిపారు. అయినా పాఠశాలకు అనుమతించలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు సమస్యను మండల విద్యాశాఖ అధికారికి తెలపగా, ఆయన పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులను బడిలోకి అనుమతించాలని ఆదేశించారు. దీంతో రెండు గంటల తరువాత విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించారు. ఎండలో నిలబెట్టిన ముగ్గురు విద్యార్థులూ ప్రైమరీ సెక్షన్‌వారు కావడంతో వేడిమిని తట్టుకోలేక బాగా నీరసించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఉన్నతాధికారులను కోరారు.



పాఠశాలలో గేటు వద్ద ఎండలో నిల్చున్న విద్యార్థులు



ఎదురుకోలు ఉత్సవంలో భక్తుల సందడి

తరలివచ్చిన తల్లి

- మూడో రోజూ సందడిగా సమ్మక్క, సారలమ్మ జాతర
- అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న మంత్రి సీతక్క

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల గ్రామంలో గురువారం నిండు జాతర ఘనంగా జరిగింది. సమ్మక్క-సారలమ్మ జాతర ఈ నెల 11న ప్రారంభంకాగా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ముసలమ్మ గుట్ట నుంచి సమ్మక్క దేవతను పూజారులు గద్దెల వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. పగిడిద్దరాజు, సారలమ్మతోపాటు ఇలవేల్పులతో కోలాహలంగా ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. గురువారం రాత్రి 1.30 గంటలకు సమ్మక్క దేవతకు పగిడిద్ద రాజుతో కల్యాణం జరిపారు. శివసత్తుల నృత్యాలు చేస్తూ పూనకాలతో ఊగిపోయారు. ఆదివాసీ డప్పు కళాకారుల నృత్యాలతో సందడి చేశారు. కాగా ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ప్రకృతి దేవతలు సమ్మక్క, సారలమ్మలు – మంత్రి సీతక్క

సమ్మక్క, సారలమ్మలు ప్రకృతి వన దేవతలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆమె అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర ప్రాంతంలో పచ్చని చెట్లను తొలగించవద్దని నిర్వాహకులకు సూచించారు. జాతరకు ఈసారి ఐటీడీఏ నుంచి రూ. 5 లక్షలు కేటాయించామని, చిరుమళ్ల నుంచి ములుగు జిల్లాలోని దోమెడకు రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. అనంతరం మహిళలతో కలిసి బిందెను చేబూని, కళాకారులతో కలిసి నృత్యం చేశారు. ఐటీడీఏ పీఓ రాహుల్ పట్టువస్త్రాలు సమర్పించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



ముసలమ్మ గుట్ట నుంచి తరలివచ్చిన సమ్మక్కకు మొక్కుతున్న మంత్రి సీతక్క



కొందరు ఎదిరించి, ఇంకొందరు ఒప్పించి ప్రేమ వివాహాలు
కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ జీవన ప్రయాణం
జీవితంలో స్థిరపడ్డాక నిర్ణయమే మేలంటూ సూచన
నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమ మధురమైన అనుభూతి.. మాటలకు అందని భావం.. ఇలాంటివి చదవడానికి, వినడానికి బాగున్నా అనుభవంలోకి వచ్చేసరికి అందరికీ ఒకే రకమైన పరిస్థితులు ఎదురుకాకపోవచ్చు. ఆర్థిక స్తోమత, కులమతాలు, సామాజిక పరిస్థితులు ఇలా రకరకాల కారణాలతో ప్రేమను మధ్యలో వదులుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ పలువురు ప్రతికూల పరిస్థితులను అధిగమించి మరీ ప్రేమ వివాహాలు చేసుకున్నారు. ఇందులో కొందరు పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే, ఇంకొందరు పెళ్లి చేసుకున్నాక పెద్దలను ఒప్పించారు. నేడు (శుక్రవారం) ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అలాంటి వారిలో కొందరి అనుభవాలు తెలుసుకుందాం..

కలిశారు... కలిసున్నారు

మూడేళ్లు కష్టపడి ఒప్పించి..



కుమార్తైతో సాయికుమార్ - స్వర్ణలత

కామేపల్లి: పాల్వంచకు చెందిన బొల్లెద్దు సాయి కుమార్, కొత్తగూడెంకు చెందిన స్వర్ణలతను కులాలు వేరైనా ప్రేమ బంధం కలిపింది. కొత్తగూడెంలో 2013లో సాయి ఎంబీఏ చదివే రోజుల్లో స్వర్ణలతతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరి సామాజికవర్గాలు వేరు కావడం పెళ్లికి ఇరువైపులా పెద్దలు ఒప్పుకోలేదు. అయినా పట్టువిడకుండా మూడేళ్లకు ఇరువర్గాల కుటుంబాలను ఒప్పించి వారి చేతుల మీదుగానే 2016లో సంప్రదాయరీతిలో వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, స్వర్ణలత సహకారంతో సాయికుమార్ ఎస్సై ఉద్యోగం సాధించి ప్రస్తుతం కామేపల్లిలో విధులు నిర్వర్తిస్తుండగా స్వర్ణలత గ్రూప్స్‌కు సిద్ధమవుతోంది. వీరికి ఒక కుమార్తై నిషిక ఉంది. అయితే, యువతీయువకులు తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా ఇరు కుటుంబాల అంగీకారంతోనే పెళ్లాడితేనే భద్రత ఉంటుందని చెబుతున్నారు సాయికుమార్–స్వర్ణలత.

ఆకర్షణ - ప్రేమకు తేడాను గుర్తిస్తేనే మేలు

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ప్రేమించుకునే యువతీ, యువకులు జీవితంలో తమదైన రంగంలో స్థిరపడ్డాకే పెళ్లి ఆలోచన చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ చెబుతున్నారు. పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్న రాహుల్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే... టీనేజ్‌లో ఉండే సహజమైన ఆకర్షణను ప్రేమగా భావించొద్దు. ప్రేమించుకునే యువతీ యువకులు పరస్పర గౌరవం ఇచ్చుకున్నప్పుడు ఆ ప్రేమకు గౌరవం ఉంటుంది. రెండు కుటుంబాలను ఒప్పించి పెళ్లి చేసుకోవడం ద్వారా పెద్దలకు గౌరవం దక్కుతుంది. ప్రేమ పేరుతో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా జీవితంలో స్థిరపడేందుకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రేమ పేరుతో పైశాచికత్వానికి పాల్పడే దృక్పథాన్ని యువత మార్చుకోవాలి. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన నాకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన మనీషాతో బస్సులో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. తొలుత నేనే ప్రపోజ్ చేశా. కొద్ది కాలం గడిచాక ఆమె కూడా అంగీకరించడంతో జీవితం, భవిష్యత్‌పై పరస్పరం మాట్లాడుకున్నాం. ఆపై పెద్దలకు చెప్పి వారిని ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. ఖమ్మంలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయాన మా వివాహం జరిగింది.



రాహుల్ - మనీషా

పోలీసు శిక్షణ కేంద్రంలో చిగురించిన ప్రేమ



కుమారుడితో నాగుల్‌మీరా-షేక్ హసీనా

కొత్తగూడెం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్సైలు విధులుగా నిర్వర్తిస్తున్న షేక్ హసీనా, పఠాన్ నాగుల్‌మీరా మధ్య పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో చిగురించిన ప్రేమ పెళ్లిగా మారింది. హైదరాబాద్ ఎల్‌బీ.నగర్‌కు చెందిన షేక్ హసీనా ఇంజనీరింగ్ పూర్తిచేశాక 2019 ఎస్సైగా ఎంపికైంది. 2020లో పోలీసు అకాడమీలో శిక్షణకు వెళ్లింది. ఖమ్మం జిల్లా మధిర మండలం భీమవరానికి చెందిన పఠాన్ నాగుల్‌మీరా కూడా ఇంజనీరింగ్ పూర్తిచేయగా 2020లో ఎస్సై శిక్షణకు వెళ్లాడు. అక్కడే ఇద్దరి మధ్య స్నేహం మొదలైప్రేమగా మారగా కుటుంబానికి చెప్పారు. హసీనా తరఫు వారు సమయం తీసుకోగా ఎవరికి వారి పెద్దలకు ప్రేమను వివరించడంతో ఎట్టకేలకు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రస్తుతం హసీనా కొత్తగూడెం ఐటీ వింగ్‌లో, నాగుల్‌మీరా ఇల్లెందులో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ప్రస్తుతం కుమారుడు అర్హాన్‌ఖాన్ ఉన్నాడు. ఇద్దరు విధులకు వెళ్లాల్సి రావడంతో పెద్దలు చేయూతగా నిలుస్తున్నారని చెప్పిన నాగుల్‌మీరా.. ఇంట్లో పనులన్నీ హసీనా చేస్తుందని.. అడపదడపా తాను సాయం చేస్తానని చెప్పారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే బాబు పెంపకంలో శ్రద్ధ వహిస్తున్నామని వెల్లడించారు.

క్రీడలే వాళ్లను ఒక్కటి చేశాయి..



మల్లికార్జున్ - మాన్విత

కొత్తగూడెంటౌన్: క్రీడారంగంలో ఒకరు కోచ్‌గా కొనసాగుతుండగా.. అక్కడ శిక్షణకు వచ్చిన యువతి మనస్సులు కలవడంతో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. కొత్తగూడెం చుంచుపల్లి విద్యానగర్ కాలనీకి చెందిన దుంపల మల్లికార్జున్‌రావు బీపీఈడీ పూర్తిచేశాక అథ్లెటిక్స్ క్రీడాకారుడిగా, కోచ్‌గా రాణిస్తున్నారు. ఆయన వద్దకు శిక్షణ కోసం 2016లో కొత్తగూడెం బాబుక్యాంప్‌నకు చెందిన కడలి మాన్విత వచ్చింది. అంతకు ముందే పరిచయం ఉండడంతో స్నేహం కాస్తా ప్రేమగా మారింది. ఇలా 2016 నుంచి 2019 వరకు కొనసాగిన ఈ ప్రేమికుల కులాల వేరైనా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం మాన్విత సింగరేణి ఎస్టేట్ విభాగంలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తుండగా.. మల్లికార్జున్ కోచ్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం వీరికి మూడేళ్ల కుమారుడు జాశ్విక్ ఉన్నాడు.

ప్రేమ పెళ్లితో జీవితంలో గెలిచాం



నవతన్ - ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: ప్రేమించి పెళ్లి చేసుకుంటే కష్టాల పాలవుతామని భయపడ్డాం.. కానీ పెళ్లి తర్వాతే జీవితంలో గెలిచామని కొత్తగూడెంకు చెందిన కొప్పరి నవతన్ తెలిపారు. చుంచుపల్లి మండలం రామాంజనేయకాలనీకి చెందిన మాజీ వార్డు మెంబర్ అయిన నవతన్ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీలో పనిచేసి, ఇప్పుడు రాజకీయాల్లో కొనసాగుతున్నారు. విద్యార్థి దశలోనే మంచిర్యాలకు చెందిన ప్రియాంకతో ఆయనకు 2006లో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అనంతరం 2009లో వీరు ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ వివాహంలో కష్టాలు, నష్టాలు ఉంటాయని భయపడినా... తన భార్య సలహాలు, సూచనతో ముందుకు సాగుతున్నానని నవతన్ తెలిపారు. జీవితంలో విజయవంతంగా ముందుకు సాగడంలో పరస్పర సహకారమే ప్రధానమని నవతన్ దంపతులు వెల్లడించారు.

ఒడిదొడుకులు వచ్చినా ఒకటిగా..



పిల్లలతో మహేష్- లలిత

ఇల్లెందు: కులాలు వేరు కావడంతో పెద్దలు అంగీకరించకపోవడంతో దైవసన్నిధిలో ఒక్కటైన ఈ జంట ఆతర్వాత రెండు కుటుంబాలకు దగ్గరయ్యారు. ఇల్లెందు కాకతీయనగర్ చెందిన సాంబ మహేష్(బీసీ) – గంగావత్ లలిత(ఎస్టీ) ఒకే ఏరియాలో నివాసముంటుండగా ప్రేమలో పడ్డారు. ఐదేళ్ల ప్రేమ అనంతరం పెద్దల అంగీకారం లేకపోవడంతో భద్రాచలంలోని కుసుమ హరనాథ స్వామి ఆలయంలో 2010 సెప్టెంబర్ 5న వివాహం చేసుకున్నారు. ఆతర్వాత కొన్నాళ్లకు పెద్దలు సైతం చేరదీశారు. ప్రస్తుతం వీరిద్దరికి ఇద్దరు పిల్లలు నిత్య సాయిశ్రీ, జోషిత్ సాయి ఉన్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పరస్పర అవగాహన, పట్టు విడుపులతో చర్చించుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఇరు వర్గాల ఆచారాలను గౌరవించడం, కష్టాల్లో తోడునీడగా మెదులుతుండడంతోనే ఇది సాధ్యమైందని వెల్లడించారు.

తొలి చూపులోనే ఏకమైన మనసులు



కుమారుడు, కుమార్తెతో ప్రభాకర్‌రావు, సత్యవల్లి

ఇల్లెందురూరల్: అనుకోకుండా తారసపడిన ఆమెను తొలి చూపులోనే ప్రేమించి రెండేళ్ల అనంతరం పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నామని చెబుతున్నారు. ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు చింతూరుకు చెందిన ఆయన పీజీ పూర్తి చేశాక ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. సాయంత్రం వేళ కాలక్షేపానికి ట్యూషన్ చెప్పే క్రమాన రేఖపల్లికి చెందిన సత్యవల్లిని చూసి ఇష్టపడి ప్రపోస్ చేయగా ఆమె సైతం అంగీకరించిందని తెలిపారు. రెండేళ్లు గడిచాక కులాలు వేర్వేరైనా పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. సత్యవల్లి గృహిణిగా, ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం అధ్యాపకుడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రభాకర్‌రావు కొనసాగుతున్నారు. వీరి కుమార్తె యజ్ఞ వరంగల్ నిట్‌లో ఇంజనీరింగ్, కుమారుడు కృష్ణచైతన్య ఇంటర్ చదువుతున్నాడు.

జనజీవన స్రవంతిలో కలవాలి

- తగ్గిపోతున్న మావోయిస్టుల ప్రభావం
- ఎస్పీ రోహిత్ రాజు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలంఅర్బన్: మావోయిస్టుల ప్రభావం క్రమేపీ తగ్గుతోందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. గురువారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిస్తే అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ హోదాల్లో పనిచేస్తున్న, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 19 మంది స్వచ్ఛందంగా లొంగిపోయారని వివరించారు. అనంతరం గతేడాది డిసెంబర్‌లో లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టు సభ్యులకు చెరో రూ.4 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు పరితోష్ పంకజ్, విక్రాంత్ కుమార్ సింగ్, 141 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ ప్రీతా, 81 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ రాజేష్ డోగ్రా, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, సీఐలు అశోక్, రాజువర్మ, రమేష్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినీ మేడారం జాతరకు బస్సులు

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న సమ్మక్క – సారలమ్మ మినీ జాతరకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేశారు. బస్సులు లేకపోవడంతో భక్తుల ఇక్కట్లపై గురువారం 'సాక్షి'లో 'మినీ మేడారం జాతరకు బస్సులేవి?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించి ఆర్టీసీ అధికారులు కొత్తగూడెంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మేడారానికి బస్సు సర్వీసులు ప్రారంభించారు. కొత్తగూడెంలో ఉదయం 8గంటలకు బయలుదేరే బస్సు పాల్వంచ, మణుగూరు, ఏటూరు నాగారం మీదుగా మేడారం చేరుకుని, తిరిగిన సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరుతుందని డీఎం దేవేందర్‌గౌడ్ తెలిపారు. మేడారం వెళ్లే భక్తులు ఈ బస్సును వినియోగించుకోవాలని, మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని పేర్కొన్నారు.

చేపల చెరువు పరిశీలన..



చెరువును పరిశీలిస్తున్న మత్స్యశాఖాధికారి

పాల్వంచరూరల్: మండలపరిధి రాజాపురం గ్రామ శివారులోని చేపల చెరువును గురువారం జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. గురువారం 'సాక్షి'లో 'వ్యర్థాలా.. మృతి చెందిన కోళ్లా?'అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో జిల్లా మత్స్యశాఖ అధికారి స్పందించారు. ఈ మేరకు చెరువును పరిశీలించి చెరువు యజమానికి నోటీసు అందించారు. తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు

ఇల్లెందు: ఇంటిని విక్రయించి మళ్లీ అదే ఇల్లు కావాలని దౌర్జన్యం చేసిన ఘటనలో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్‌ఐ బి.సూర్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 24 ఏరియాకు చెందిన అమృతభవానీ అనే మహిళ 2022లో యమునకు చెందిన ఇంటిని రూ.8లక్షలకు కొనుగోలు చేసింది. ఆ ఇంట్లో నివాసం ఉంటుండగా.. గురువారం తన ఇంటిని తనకే అప్పగించాలని యమునతో పాటు స్వప్న, రామ్మోహన్, నిర్మలు అమృతభవానీ ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేసి ఇంటికి తాళంవేసి సామన్లు బయట వేశారని చెప్పారు. దీంతో అమృతభవానీ ఫిర్యాదు మేరకు యమునతో పాటు మరో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై..

అశ్వారావుపేటరూరల్: ఓ వివాహిత అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని వేదాంతపురం గ్రామానికి చెందిన దారా రమేష్ ఇదే మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ సుభానితో రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఈ నెల 11వ తేదీ రాత్రి బయటకు వెళ్లిన సుభాని తిరిగి రాకపోవడంతో ఆమె భర్త రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి కేసులో ఐదుగురు రిమాండ్

అశ్వాపురం: మండల పరిధిలోని మనుబోతులగూడెంలో మణుగూరు ఎఫ్‌డీఓపై దాడి చేసిన కేసులో ఐదుగురికి 14 రోజులు రిమాండ్ విధించారు. ఎఫ్‌డీఓపై దాడి చేసిన మనుబోతులగూడెం గ్రామానికి చెందిన వలస ఆదివాసీలు పొడియం నాగేశ్వరరావు, పాడియం పవన్, సొడె ధర్మయ్య, కణితి సీత, మడకం సీతను గురువారం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు. అనంతరం వీరిని భద్రాచలం సబ్ జైలుకు తరలించారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన ట్రాలీ

జూలూరుపాడు: ఆగి ఉన్న స్కూల్ బస్సును ఓ ట్రాలీ ఢీకొట్టిన ఘటనలో బస్సు హెల్పర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు గురువారం మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలోని కాకర్ల వెళ్లే రహదారిపై పిల్ల లను డ్రాప్ చేసేందుకు ఆగింది. ఈక్రమంలో బస్సు హెల్పర్ శ్రీను పిల్లలను దించేందుకు కిందకు దిగగా.. అదే సమయాన ఎదురుగా వచ్చిన ట్రాలీ బస్సును ఢీకొట్టింది. దీంతో హెల్పర్‌కు తీవ్ర గాయాలు కాగా పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. క్షతగాత్రుడిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

భద్రాచలంఅర్బన్: చెక్‌బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధించారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన పడిగా రాజేందర్‌రెడ్డి భద్రాచలం సరిహద్దున ఉన్న ఎటపాకకు చెందిన వరకా శ్రీనివాసరావుకు అప్పుగా రూ.3లక్షలు ఇచ్చాడు. ఈక్రమంలో శ్రీనివాసరావు తన పేరున ఉన్న ఓ చెక్కును రాజేందర్‌రెడ్డికి ఇచ్చాడు. కొంత కాలం తర్వాత తీసుకున్న నగదు చెల్లించాలని పలుమార్లు అడిగినా స్పందించకపోవడంతో ఆ చెక్కును బ్యాంక్‌లో వేయగా అది బౌన్స్ అయింది. దీంతో రాజేందర్‌రెడ్డి తన న్యాయవాది రావి రామ్మోహన్‌రావు ద్వారా కోర్టులో కేసు వేయగా.. శ్రీనివాసరావుకి ఆరునెలల జైలు శిక్షతో రూ.3 లక్షలు చెల్లించాలని గురువారం భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ తీర్పు ఇచ్చారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి భద్రాచలంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారని చెప్పారు. ఈ సందర్భంగా వారిని అదుపులోకి తీసుకోగా రూ.3లక్షల విలువైన 2.080 కేజీల గంజాయి లభించిందని, నిందితులు నల్లగొండకు చెందిన ముంత నవీన్, నగరికంటి సుభాష్‌గా తేలిందని వెల్లడించారు. వీరిద్దరు ఒడిశా నుంచి నల్లగొండకు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో నిందితులు, గంజాయి, ద్విచక్ర వాహనాన్ని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది బాలు, సుధీర్, హరీష్, వెంకట్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

విస్తరణ పనుల్లో వివాదాలు వద్దు

అశ్వారావుపేట: డ్రైనేయిజీ, రోడ్డు విస్తరణ పనులను వివాదాలు లేకుండా చేపట్టాలని నేషనల్ హైవే ఈఈ యుగంధర్ అన్నారు. మూడు రోజుల క్రితం స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో గల మసీదు కాంప్లెక్స్ వద్ద చేపట్టిన రహదారి విస్తరణ, డ్రైనేయిజీ నిర్మాణాల సమస్యపై స్థానిక ముస్లిం కమిటీ పెద్దలు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మసీదు కాంప్లెక్స్ మార్గం ఖమ్మం–అశ్వారావుపేట నేషనల్ హైవే పరిధిలో ఉండడంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా ఎన్‌హెచ్ ఈఈను మంత్రి ఆదేశించారు. దీంతో గురువారం ఆయన పనులను పరిశీలించి50 అడుగుల మేర మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని స్థానిక ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్‌కు సూచించగా దీనిపై స్థానిక డీఈఈ కార్యాలయంలో ఆయా పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, ఎన్‌హెచ్ డీఈఈ బషీర్, ఆర్అండ్‌బీ ఏఈఈ రామిశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

ఇసుక ట్రక్కులు సీజ్

దమ్మపేట: పామాయిల్ క్షేత్రంలో అక్రమంగా దాచి ఉంచిన ఇసుక ట్రాక్టర్ ట్రక్కులను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. మండలంలోని రెడ్యాలపాడు శివారులోని మల్లెపూల వాగులో ఇసుకను అక్రమంగా రెండు ట్రాక్టర్‌లో లోడ్ చేసి స్థానికంగా గల పామాయిల్ తోటకు తరలించారు. ఇంజన్ భాగాన్ని విడదీసి ట్రక్కులు మాత్రమే దాచి ఉంచగా.. అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడి చేసి ఆ ట్రక్కులను పట్టుకున్నారు. పోలీసుల సహకారంతో వీటిని సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి తెలిపారు.

కేసీఆర్ పుట్టినరోజున వృక్షార్చన కార్యక్రమం

భద్రాచలంఅర్బన్: తెలంగాణ మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న హరిత సేన ఆధ్వర్యాన నిర్వహించే వృక్షార్చన కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్, కోకన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, హరిత సేన నియోజకవర్గ నాయకుడు కీసర యువరాజు, నాయకులు గుంజ ఏడుకొండలు, రామకృష్ణ, నాగేశ్వరరావు, రోహిత్ పాషా, ఎల్.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఇద్దరు మృతి





భూక్యా హరిబాబు, భూక్యా సోమ్లా(ఫైల్)

దుమ్ముగూడెం: ఇసుక లారీలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ఆంధ్రకేసరి నగర్, బైరాగులపాడు గ్రామాల మధ్య గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా హరిబాబు(45), భూక్యా సోమ్లా (36) కొత్తగూడెంలో సంస్మరణ కార్యక్రమానికి బైక్‌పై వెళ్తుండగా భద్రాచలం నుంచి చర్ల వైపు ఇసుక లోడ్ కోసం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ద్విచక్ర వాహనాన్ని సుమారు 15 అడుగుల మేర ఈడ్చుకెళ్లడంతో హరిబాబు, సోమ్లా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ లారీ ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించగా బైరాగులపాడు వద్ద గ్రామస్తులు అడ్డుకుని పట్టుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ గణేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి, మృతదేహాలను పోస్టుమార్టం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. సీఐ అశోక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా ఇసుక లారీలతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని, రామచంద్రాపురం క్రాస్ రోడ్డు వద్ద సుజ్ఞానపురం, జడ్ వీరభద్రారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని దాదాపు మూడుగంటలపాటు ఆందోళన నిర్వహించారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడగా సీఐతోపాటు తహసీల్దార్ అశోక్‌కుమార్ చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అదుపు తప్పి కారు బోల్తా, వ్యక్తి మృతి



సాయి (ఫైల్)

కారేపల్లి/ఇల్లెందు: అదుపుతప్పి కారు బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం శాంతినగర్ సమీపాన గురువారం చోటు చేసుకుంది. ఇల్లెందుకు చెందిన దేరంగుల సాయి (30) హైదరాబాద్‌లో ఉంటుండగా, బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో కారేపల్లి క్రాస్ వద్ద సాయి స్నేహితులైన ఇల్లెందు వాసులు కళ్యాణ్‌లోథ్, కార్తీక్ లోథ్ కూడా కారు ఎక్కారు. ఈక్రమంలో శాంతినగర్ సమీపాన అడ్డొచ్చిన కుక్కలను తప్పించే క్రమాన కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. సాయి తండ్రి దేరంగుల పోశం బీఆర్ఎస్ నాయకుడు కాగా, ఆయనకు భార్య కావ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనలో మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, పోశంను బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.